క్లుప్తంగా

ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు

నందిగామటౌన్/జగ్గయ్యపేటఅర్బన్: నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల ప్రజలకు ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్, మాజీఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహనరావు,పేట వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. క్రిస్మస్ పండుగ అందరి జీవితాలలో వెలుగులు నింపాలని, ఏసుక్రీస్తు కరుణ, కటాక్షాలు వారికి మెండుగా ఉండాలని ఆకాంక్షించారు.

మర్యాదపూర్వకంగా నడుచుకోవాలి



నందిగామటౌన్: పోలీస్ స్టేషన్‌కు వచ్చే వారి పట్ల మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని ఏసీపీ తిలక్ అన్నారు. వార్షిక తనిఖీలలో భాగంగా నందిగామ పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ముందుగా స్టేషన్ రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మాట్లాడుతూ సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కలిగించాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ వైవీఎల్ నాయుడు, ఎస్‌ఐ అభిమన్యు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి సమస్య పరిష్కారానికి కృషి

నందిగామ టౌన్: రెవెన్యూ సదస్సులకు వచ్చే ప్రతి ఒక్క దరఖాస్తును పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దార్ సురేష్‌బాబు అన్నారు. మండలంలోని అడవిరావులపాడు గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల వ్యవసాయ భూములకు సంబంధించి రెవెన్యూ పరమైన ప్రతి ఒక్క సమస్య పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ముఖ్యంగా 22ఏ నిషేధిత భూముల సమస్య పరిష్కరించాలని ఆయా గ్రామాల నుంచి దరఖాస్తులు అందుతున్నాయని విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. అనంతరం పలు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రైతులు దరఖాస్తులు అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆకుల హనుమంతరావు, సర్పంచ్ సూరా వెంకట నర్సమ్మ, పలువురు రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అమ్రితసాయి విద్యార్థినికి అవార్డు



కంచికచర్ల: ఇటీవల విజయవాడ స్వర్ణ కన్వెన్షన్‌లో నిర్వహించిన మోడల్ ఆఫ్ ది ఇయర్ రన్‌వే ఆఫ్ ఫ్యాషన్ వీక్‌లో ద్వితీయ స్థానం పొందిన పరిటాల అమ్రిత సాయి కళాశాల విద్యార్థిని సులోచనారాణిని మంగళవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో అభినందించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కె.రామ్మోహనరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శశిధర్, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ పి.చిరంజీవి, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ డాక్టర్ ఎం.శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఈకేవైసీ చేయించుకోవాలి

పొన్నవరం(వీరులపాడు): సహకార సంఘంలో సభ్యత్వం, రుణం ఉన్న రైతులు ఈకేవైసీ చేయించుకోవాలని సంఘ కార్యదర్శి భద్రయ్య తెలిపారు. మండలంలోని పొన్నవరం గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈకేవైసీ చేయించుకునే రైతులు ఆధార్, పాన్ కార్డు తీసుకురావాలన్నారు. ప్రతి ఒక్కరూ విధిగా ఈకేవైసీ చేయించుకోవాలని కోరారు.

అంగన్‌వాడీ కేంద్రంలో సెమీ క్రిస్మస్ వేడుకలు

ముండ్లపాడు(పెనుగంచిప్రోలు): గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేయటంతో పాటు ఏసుక్రీస్తు శాంతి, ప్రేమ, దయాగుణాన్ని తెలియజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త ధనలక్ష్మి, చిన్నారులు పాల్గొన్నారు.

కనపర్తికి సత్కారం



జగ్గయ్యపేటఅర్బన్: వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, చిల్లకల్లు సమితి మాజీ అధ్యక్షుడు కనపర్తి శేషగిరిరావును వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు, పలువురు పార్టీ నాయకులు మంగళవారం ఘనంగా సన్మానించారు. స్థానిక పార్టీ కార్యాలయానికి తొలిసారిగా విచ్చేసిన కనపర్తికి పుష్పగుచ్ఛాలు, పూలమాలలతో స్వాగతం పలికి సన్మానించారు.

కోటిలింగాల దత్తత నిలిచినట్టేనా?

- దత్తత కోసం శివస్వామి ప్రయత్నాలు
- కమిషనర్ ఉత్తర్వులపై అనుమానాలు
- కోట్ల రూపాయలు చేతులు మారినట్లు అభియోగాలు



జగ్గయ్యపేట మండలంలోని కోటిలింగ హరిహర మహా క్షేత్రం

ముక్త్యాల(జగ్గయ్యపేట): మండలంలోని ముక్త్యాల గ్రామ సమీపంలోని కోటిలింగ హరిహర మహా క్షేత్రంలోని కామాక్షి సమేత పంచముఖ అమృత లింగేశ్వరస్వామి వారి ఆలయాన్ని గుంటూరు జిల్లా తాళ్లాయపాలెం శైవ క్షేత్ర వ్యవస్థాపకుడు శివస్వామికి దత్తత ఇచ్చే కార్యక్రమం నిలిచిపోయింది. ఈ నెల 19న ఆలయాన్ని శివస్వామికి దత్తత ఇచ్చేందుకు దేవదాయశాఖ కమిషనర్ ఆగమేఘాలపై ఉత్తర్వులిచ్చారు. మరుసటి రోజునే ఆలయానికి సంబంధించిన రికార్డులను శివస్వామికి జిల్లా అసిస్టెంట్ కమిషనర్ బాధ్యతలను అప్పగించి, ఆయనకు దత్తత ఇస్తున్నట్లు ప్రకటించారు. దత్తత ఇచ్చిన కొన్ని గంటల్లోనే కమిషనర్ ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేసి దేవదాయ శాఖ అధీనంలోనే ఉంటుందని ఈవోకు బాధ్యతలు అప్పగించారు. దీంతో ప్రస్తుతం దత్తత కార్యక్రమం నిలిచిపోయింది.

ఆలయానికి కోట్ల ఆస్తులు....

2006లో సుమారు 46.30 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన కోటిలింగాల ఆలయం రెండేళ్ల పాటు ప్రైవేట్ వ్యక్తుల అధీనంలో కొనసాగింది. 2009–10వ సంవత్సరంలో కోటిలింగాల ఆలయం వ్యవస్థాపకుడు గద్దె ప్రసాద్ సిబ్బందికి జీతభత్యాలు కూడా ఇవ్వలేని స్థితిలో దేవదాయ శాఖ అధీనంలోకి తీసుకోవాలని దరఖాస్తు చేసుకోవటంతో ఆలయం దేవదాయ శాఖ అధీనంలోకి వెళ్లింది. అప్పటికే ఆలయంలో 100 ఉపాలయాలు, ప్రధాన ఆలయంతో పాటు కోనేటి రాయుడి ఆలయం ఉంది. అదే సమయంలో శివలింగాల ప్రతిష్ఠకు రూ.693 రుసుము ఉండటంతో వివిధ రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ప్రతిష్ఠించేవారు. దీంతో ఆలయానికి రూ.45 లక్షల ఆదాయంతో పాటు అన్నదానం ద్వారా రూ.60 లక్షలు, జనరల్ నిధుల ద్వారా రూ.70 లక్షలు సమకూరటంతో ఎఫ్‌డీల పేరుతో ఆలయానికి రూ.1.20 కోట్లు ఉంది.

2021లో శివస్వామి అర్జీ...

2021లో గుంటూరు జిల్లా తాళ్లాయపాలెం శైవ క్షేత్ర వ్యవస్థాపకుడు శివస్వామి కోటిలింగాల క్షేత్రాన్ని దత్తత ఇవ్వాలని ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. దీంతో అప్పటి దేవదాయ శాఖాధికారులు దరఖాస్తును పరిశీలించి నివేదికను తయారుచేసి ప్రభుత్వానికి అందించారు. నివేదికలో కొన్ని సమస్యలుండటంతో దత్తత ప్రక్రియ నిలిచిపోయింది.

కూటమి వచ్చిన ఏడు నెలల్లోనే...

కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడు నెలల్లోనే శివస్వామికి కోటిలింగాల క్షేత్రాన్ని దత్తత ఇస్తూ దేవదాయ శాఖ కమిషనర్ సీరియల్ నంబరు మూడు ప్రకారం సర్క్యులర్ జారీ చేశారు. ఆలయాన్ని దత్తత ఇవ్వడం నిబంధనలకు విరుద్ధమని గత ప్రభుత్వంలో అధికారుల నివేదిక ఇవ్వగా, కూటమి ప్రభుత్వం మాత్రం దత్తత ఇచ్చేందుకు అనుమతులివ్వటంపై కోట్లాది రూపాయలు చేతులు మారినట్టు దేవదాయశాఖ కమిషనర్‌పై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

సెక్షన్ 145-1ఏపై అవగాహన లేమితోనే...

సెక్షన్ 145–1ఏ ప్రకారం ఆదాయం, జీతభత్యాలు, దీపధూప నైవేద్యాలకు కూడా ఇబ్బందిగా ఉండే ఆలయాలను దత్తత తీసుకునే నిర్వాహకులు దత్తత తీసుకున్న ఆలయ నిర్వహణ కూడా చేయగలిగే స్తోమత ఉండి ఉండాలి. ప్రైవేట్ వ్యక్తులకు ఆలయాన్ని దత్తత ఇస్తే ఐదేళ్ల పాటు వారి అధీనంలోనే ఉంటుంది. భూ విక్రయాలు, అక్రమ కట్టడాలు, కూల్చటాలు, సిబ్బంది విషయంలో జోక్యం కాని, నూతన కట్టడాలు, ఎఫ్‌డీలపై అజమాయిషీ కాని ఉండవని చెబుతోంది.

శైవక్షేత్రంపై దేవదాయ శాఖ ఆరా...

కోటిలింగాల క్షేత్రం సమీపంలోని ప్రైవేట్ వెంచర్ భూముల ధరలు పెంచటంతో పాటు ఆలయానికి ఉన్న రూ.కోట్ల విలువ చేసే భూములను కాజేసేందుకే దత్తత డ్రామాకు తెర తీశారని గ్రామస్తులు, భక్తులు ఆరోపిస్తున్నారు. ఈ దత్తత విషయంలో నియోజకవర్గానికి చెందిన టీడీపీ నేత వెనుక ఉండి నడిపిస్తున్నట్లు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అసలు తాళ్లాయపాలెంలోని శైవక్షేత్రం దేవదాయ శాఖ నిబంధనలకు అనుగుణంగా ఉందా లేదా అని చూడాలని పెద్ద సంఖ్యలో భక్తులు కోరుతుండటంతో ఆ దిశగా దేవదాయ శాఖ అధికారులు ఆరా తీస్తున్నట్లు సమాచారం.

దత్తత కోసం ఆగని యత్నాలు...

కోటి లింగాలను ప్రస్తుతం శివస్వామికి దత్తత నిలిపి వేయడంతో దత్తత కోసం శివస్వామి ప్రభుత్వ పెద్దలతో పావులు కదుపుతున్నారు. కోటిలింగాలకు చెందిన భూములు తనకు చెందినవని, కొన్ని కారణాల వల్ల అప్పటి వ్యవస్థాపకుడితో విభేదాల కారణంగా మౌనంగా ఉన్నానని ప్రస్తుతం ఆ భూముల్లో కొంతభాగం తనకు చెందిందని ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకువెళ్లడంతో దత్తత ఇచ్చే విషయం ప్రస్తుతం నిలిచిపోయింది.

పెరిగిన సుబాబుల్ సాగు విస్తీర్ణం

- టన్ను రూ.5000 వరకు ధర
- సన్నకర్రకు కూడా డిమాండ్



వత్సవాయిలో సాగవుతున్న సుబాబుల్ పంట

వత్సవాయి: అతివృష్టి, అనావృష్టిలను సైతం తట్టుకుని పెట్టుబడి తక్కువగా ఉండి రైతుకు లాభాన్నిచ్చే సుబాబుల్ పంటపై రైతులు ఇటీవలి కాలంలో ఎక్కువగా మక్కువ చూపుతున్నారు. సుబాబుల్ కర్రకు మార్కెట్‌లో మంచి ధర పలుకుతుండడంతో రైతులు ఈ ఏడాది సుబాబుల్ కర్రను విస్తారంగా సాగు చేశారు. ఏడెనిమిది ఏళ్ల క్రితం సరైన ధర లేకపోవడంతో రైతులు సుబాబుల్ పంటను తొలగించి పత్తి, మిరప పంటల వైపు మొగ్గు చూపారు. ప్రస్తుతం ఒకవైపు పత్తి, మిరప పంటలలో వస్తున్న నష్టాలు, మరోవైపు పేపర్ కంపెనీలు కర్రకు మంచి ధర ఇస్తుండడంతో రైతులు మరలా సుబాబుల్ సాగు వైపు మళ్లారు. జగ్గయ్యపేట నియోజకవర్గంలోని వత్సవాయి, జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలు మండలాల్లో కలిపి మొత్తం ఈ ఏడాది 15 వేల ఎకరాలకు పైగా సుబాబుల్ సాగు చేపట్టారని తెలుస్తోంది. గతంలో సుబాబుల్ పంటను బీడు భూములు, సాగునీటికి అవకాశం లేని పొలాల్లో మాత్రమే సాగు చేసేవారు. కానీ ప్రస్తుతం సుబాబుల్ కర్రకు పత్తి, మిరప పంటల కంటే ఎక్కువ లాభాలు రానుండడంతో రైతులు సాగు నీరు పారే అవకాశం ఉండి పత్తి, మిరప పంటలను సాగు చేసే భూముల్లో కూడా సుబాబుల్ సాగు చేపట్టారు. ప్రకృతి వైపరీత్యాలను కూడా తట్టుకుంటుంది కాబట్టి సుబాబుల్ సాగును విస్తారంగా చేపడుతున్నారు. గతంలో టన్ను సుబాబుల్ కర్ర రూ.1500 నుంచి రూ.2000 వరకు మాత్రమే ధర ఉండేది. దీంతో నష్టాలు వస్తుండడంతో రైతులు సుబాబుల్ పంటను పీకి వేరే పంటలను సాగు చేశారు. ప్రస్తుతం మార్కెట్‌లో కర్ర టన్నుకు రూ.4500 నుంచి రూ.5 వేల వరకు రైతుకు అందుతుంది. ఎకరానికి సుమారు 30 టన్నుల వరకు కర్ర దిగుబడి వచ్చే అవకాశం ఎక్కువగా ఉంది. అంటే ఎకరానికి మూడేళ్లకు సుమారు లక్షకు పైబడి ఆదాయం వస్తుంది. పంట నాటిన మొదటి సంవత్సరం సుబాబుల్‌లో అంతర పంటగా పత్తిని వేయడం వల్ల పెట్టుబడులు వస్తున్నాయని రైతులు ఆనందంగా చెబుతున్నారు.

సన్న కర్రకు కూడా డిమాండ్..

గతంలో సుబాబుల్ కంపెనీలు లావుగా ఉన్న కర్రను కొనుగోలు చేసి సన్న కర్రని వదిలిపెట్టేవారు. కానీ ప్రస్తుతం సన్న కర్రను కూడా కొనుగోలు చేస్తున్నారు. జగ్గయ్యపేట పరిసర ప్రాంతాలలో విద్యుత్ ప్లాంట్లు కూడా పెరగడంతో వారు కూడా అన్ని రకాల కర్రను కొంటున్నారు. రైతులు కూడా డిమాండ్ ఉన్నప్పుడే నాలుగు డబ్బులు వెనకేసుకోవాలనే ఉద్దేశంతో పొలాల గట్ల వెంబడి, దొడ్లలో ఉన్న కర్రను కూడా వేస్టుగా పోనియ్యకుండా అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు.

విజ్ఞాన్‌లో ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



విజ్ఞాన్ స్కూల్‌లో క్రీస్తు పుట్టుక వృత్తాంతాన్ని తెలియజేస్తున్న సాంస్కృతిక ప్రదర్శన

జగ్గయ్యపేటఅర్బన్: స్థానిక విజ్ఞాన్ హైస్కూల్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు మంగళవారం అత్యంత కనులపండువగా జరిగాయి. స్థానిక కాకానినగర్‌కు చెందిన ఎల్ఈఎఫ్ చర్చి పాస్టర్ కె.శాంసన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. క్రిస్మస్ స్టార్, క్రిస్మస్ తాత, మరియ మాత, క్రిస్మస్ తాత, దేవ దూతలు, గొర్రెల కాపరుల వేషధారణలు, క్రైస్తవ భక్తి గీతాల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. స్కూల్ డైరెక్టర్ తన్నీరు సుధారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దీపకాంతులతో చర్చిలు



పేటలో విద్యుత్ దీప కాంతులతో ముస్తాబైన సెయింట్ థామస్ సీఎస్ఐ టౌన్ చర్చి



విద్యుత్ దీప కాంతులతో జగన్నాథపురం నిత్య సహాయ మాత ఆలయం



జగ్గయ్యపేటలోని కోదాడ రోడ్‌లో ఉన్న బెతస్థ చర్చి

నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల పరిధిలో నియోజకవర్గ, మండల కేంద్రాల్లో ఉన్న పలు చర్చిలు క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని విద్యుద్దీప కాంతులతో శోభాయమానంగా వెలుగొందుతున్నాయి. రంగురంగుల దీపాలు, స్టార్‌లు, రంగులతో ముస్తాబయ్యాయి. మంగళవారం అర్ధరాత్రి నుంచే విశ్వాసులు ప్రార్థనల్లో పాల్గొన్నారు. - సాక్షి నెట్‌వర్క్




పేటలో విద్యుత్ దీపాలతో సెయింట్ ఆన్స్ హాస్పిటల్‌లోని పశువుల పాక సెట్



కీసర ఆర్సీఎం దేవాలయానికి విద్యుత్ దీపాలతో అలంకారం



పేటలో రంగుల విద్యుత్ దీపాలతో ముస్తాబైన యేసు తిరుహృదయ ఆర్‌సిఎం చర్చి



కంచికచర్ల మండలం పరిటాలలో విద్యుత్‌దీపాలతో యూసీసీఐ చర్చి



బలుసుపాడులోని సీఎస్ఐ చర్చి

వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సెమీ క్రిస్మస్ వేడుకలు



పేటలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న తన్నీరు నాగేశ్వరరావు, కనపర్తి

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తన్నీరు నాగేశ్వరరావు, చిల్లకల్లు సమితి మాజీ అధ్యక్షుడు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కనపర్తి శేషగిరిరావు కేక్ కట్ చేసి పార్టీ నాయకులు, కార్యకర్తలకు పంచి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ నాయకుడు ఆనందపాల్‌ను సన్మానించారు.

ప్రజలపై విద్యుత్ చార్జీల పిడుగు

- ఈ నెల 27న వైఎస్సార్ సీపీ పోరుబాట
- పోస్టర్‌ను ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



వైఎస్సార్ సీపీ పోరుబాట పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



వైఎస్సార్ సీపీ పోరుబాట పోస్టర్లను ఆవిష్కరిస్తున్న తన్నీరు, కనపర్తి తదితరులు

నందిగామ టౌన్: ఎన్నికలకు ముందు విద్యుత్ చార్జీలను పెంచబోమని అవసరమైతే తగ్గిస్తామని చెప్పిన చంద్రబాబు అధికారంలోకి వచ్చిన నెలల వ్యవధిలోనే ఇచ్చిన హామీని విస్మరించి విద్యుత్ చార్జీల పేరుతో ప్రజలపై మోయలేని భారాన్ని మోపుతున్నారని మాజీ శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ ప్రజల పక్షాన చేపడుతున్న వైఎస్సార్ సీపీ పోరుబాట వాల్‌పోస్టర్‌ను మంగళవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికారంలోకి వచ్చి ఆరు నెలలు తిరక్కుండానే కూటమి ప్రభుత్వం ప్రజలపై చార్జీల పిడుగు వేసిందన్నారు.

ఈ నెల 27న వైఎస్సార్ సీపీ పోరుబాట

కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను తక్షణమే ఉప సంహరించుకోవాలని కోరుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 27న వైఎస్సార్ సీపీ పోరుబాట కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జగన్‌మోహనరావు తెలిపారు. నియోజకవర్గ కేంద్రంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించి విద్యుత్ శాఖాధికారుల కార్యాలయాల వద్ద నిరసన వ్యక్తం చేయనున్నట్లు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని పోరుబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పాకాలపాటి కిరణ్, ఏఎంసీ మాజీ చైర్మన్ మహ్మద్ మస్తాన్, నాయకులు ఓర్సు జ్వాలా, షేక్ యాకుబ్ అలీ, ములకలపల్లి కృష్ణమోహన్, గుడేటి శ్రీనివాసరావు, వీసం దుర్గారావు, బండారు వెంకట్రావ్, మాడుగుల మనోహర్, బండారు శేషు, షేక్ మీరా, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

27 న విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద నిరసన

జగ్గయ్యపేట అర్బన్: కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలకు నిరసనగా ఈ నెల 27న విద్యుత్ శాఖ సబ్ స్టేషన్ వద్ద నిరసన, అనంతరం విద్యుత్ అధికారుల కార్యాలయం వద్ద వినతిపత్రం అందజేసే కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు తెలిపారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఈనెల 27న కరెంట్ చార్జీల బాదుడుపై వైఎస్సార్ సీపీ పోరుబాట పోస్టర్లను చిల్లకల్లు సమితి మాజీ అధ్యక్షుడు, జెడ్పీటీసీ మాజీ అధ్యక్షుడు కనపర్తి శేషగిరిరావుతో కలిసి మంగళవారం ఆయన స్థానిక పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే కరెంట్ చార్జీలను పెంచబోమని, ఇంకా తగ్గిస్తామని హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే ప్రజలపై రూ.15,485.36 కోట్ల భారం మోపిన చంద్రబాబునాయుడు మోసాన్ని ఎండగడుతూ ప్రజలతో కలిసి ఈనెల 27 న నిరసన కార్యక్రమం చేపడుతున్నట్టు తెలిపారు. నియోజకవర్గంలోని ప్రజలంతా ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ, మండల అధ్యక్షులు వట్టెం మనోహర్, బూడిద నరసింహారావు, మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజున్నీసా ఫిరోజ్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు చౌడవరపు జగదీష్, జిల్లా కార్యదర్శి మాతంగి నాగరాజు, క్రిస్టియన్ మైనార్టీ నాయకుడు ఆనందపాల్, విజయవాడ దుర్గగుడి డైరెక్టర్ నంబూరి రవి, సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీపీ పెంటి శ్రీనివాసరావు, బలుసుపాడు సర్పంచ్ సూరిబాబు, ఏఎంసీ మాజీ డైరెక్టర్లు పింగళి నర్సింహారెడ్డి, మన్నె అప్పారావు తదితరులు పాల్గొన్నారు.